# విలువ

## కె.జె.ప్రకాష్

ఉదయం పదకొండు గంటల సమయం. హాల్లో పచార్లు చేస్తూ ఆలోచిస్తు న్నాడు ప్రసాద్. 'ఏం చేయాలి?' అప్పటికి అది ఎన్నిసార్లో అతను అలా అనుకోవడం. ఎప్పటినుండో అతని ఇబ్బందిని గమనించ వంట గదిలో నుండి బయటకు వచ్చి అడిగింది అతని భార్య ప్రసన్న ''ఏమిటండీ ఏదో ఆలోచిస్తున్నారు? ఇవాళ ఆఫీసుకి వెళ్లేది లేదా ఏమిటి?'' అని.

ప్రసాద్ ఒక్కసారి భార్యకేసి అసహాయంగా చూసి తల వంచుకున్నాడు. అది గమనించిన అతని భార్య ''ఏమండీ...ఏమిటి అలా వున్నారు? ఒంట్లో బాగాలేదా?'' అని అడిగింది.

''ఏమీలేదులే'' సమాధానమిస్తూ కుర్చీలో కూలబడ్డాడు ప్రసాద్.

''రెండురోజులనుంచి చూస్తున్నాను ఏదో పోగొట్టుకున్నవాడిలాగా అలా మదనపడుతున్నారు. నాతో చెప్పకూడదా?'' నిష్టూరంగా అంది ప్రసన్న.

''మొన్న అమ్మకి వంట్లో బాగుండకపోతే డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్లాను. అప్పుడు తెలిసింది అమ్మకి కేన్సర్ అని'' నిర్వికారంగా బదులిచ్చాడు ప్రసాద్. నెత్తిన పిడుగు పడ్డట్టు అదిరిపడింది ప్రసన్న ఆ మాటతో.

అవడానికి అన్నపూర్ణమ్మగారు అత్తగారే అయినా తనని కన్నబిడ్డలా చూసుకునే అత్తగారంటే అంతులేని అభిమానం ప్రసన్నకి. అందులకే ఆ మాట వినడంతోనే చేష్టలుడిగినదానిలా భర్తను చూస్తుండిపోయింది.

''అవును ప్రసన్న! అమ్మకి క్యాన్సర్ అని డాక్టర్ చెప్పేదాకా నాకు తెలియలేదు. ఇప్పుడేం చేయాలో అర్థం కావడంలేదు. డాక్టర్ ఆపరేషన్‌కి 50 వేలు దాకా అవుతాయంటున్నారు. అంత డబ్బు ఒక్కసారిగా ఎక్కడనుంచి తేగలం. అందుకే ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాను'' చెప్పాడు ప్రసాద్.

''యాభైవేలు అవుతాయని అత్తయ్యగారికి ఆపరేషన్ చేయించకుండా వూరుకుంటామా? మీ ఫ్రెండ్ సుధీర్‌ని అడిగి చూడండి. మీరిద్దరూ చిన్ననాటి స్నేహితులేకదా. అతను మీరడిగితే కాదనకపోవచ్చు.'' అని చెప్పింది.

అవును నిజమే. సుధీర్ నా చిన్ననాటి స్నేహితుడు కాదు, నా ప్రాణంలో నా ప్రాణంగా తిరిగిన వాడు. వాడు మటుకు నాతోపాటు అమ్మ దగ్గర గోరుముద్దలు తినలేదా ఏమిటి? అమ్మ ఆపరేషన్‌కంటే ఇవ్వకపోడు. నిజంగా అతడిని అడిగి రావాలి. ఈ రోజు అనుకుంటూ కుర్చీలోంచి లేచాడు.

• • •

ఎన్నోసార్లు ఆ ఇంటికి వచ్చిన మళ్లీ ఒకసారి ఆ ఇంటిని పరికించి చూసాడు ప్రసాద్. ఎత్తయిన ప్రహరీ లోపల అందంగా పెంచబడిన పూల తోటలు మధ్యలో రాజభవనంలా వున్న ఇల్లు. మాతో తిరిగిన సుధీర్ అంతగా ఎదిగిపోయాడంటే నమ్మలేకపోతున్నాడు ప్రసాద్.

''అరె ప్రసాద్! ఏమిటిరా అలా చూస్తున్నావు. ఎవరో కొత్త వాళ్ళు ఇంటికి వచ్చినట్టు'' అన్న సుధీర్ మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు.

''రారా...ఏమిటి విశేషాలు'' అని అడుగుతూనే లోపలకు తీసుకువెళ్లాడు సుధీర్.

''చెప్పరా ఏంటి ఇలా వచ్చావు'' కాఫీ తీసుకుంటూ అడిగాడు సుధీర్.

''ఏమీలేదురా. నీతో చిన్న పనుండి వచ్చాను'' కాఫీ కప్పును చూస్తూ సమాధానమిచ్చాడు ప్రసాద్.

''ఏమిటిరా! నాతో పని సందేహించక పని ఏమిటో చెప్పు'' అడిగాడు సుధీర్.

''అదే మొన్న అమ్మకి వంట్లో బాగుండకపోతే హాస్పిటల్‌కు తీసుకువెళ్లాను. అమ్మకి క్యాన్సర్ అని వెంటనే ఆపరేషన్ చేయాలని, ఆపరేషన్‌కు దాదాపు యాభైవేల దాకా ఖర్చు అవుతాయని డాక్టర్లు చెప్పారు. నా సంగతి నీకు తెలుసుకదా! ఏ అయిదో పదో అయితే ఎలాగో తిప్పలు పడే వాడిని. కానీ 50 వేలు అనేసరికి ఎక్కడనుండి తేగలను. అందుకే ఆ యాభైవేలు అప్పుగా ఇస్తే మెల్లగా తీరుస్తానురా!''

''...''

''ఏమిటిరా! ఏమీ సమాధానం చెప్పవు?''

''సారీరా. నా దగ్గర ప్రస్తుతానికి అంత డబ్బు లేదు. ఐనా అంత డబ్బు అప్పుగా తీసుకుంటే ఎలా తీర్చగలవురా? అంత డబ్బు ఖర్చుపెట్టి ఆపరేషన్ చేయించినా వాళ్ళు 40 శాతం మాత్రమే అవకాశం అంటారు. నీ అదృష్టం బాగోక ఆ అరవై శాతమే నెగ్గి...''

''సుధీర్!'' ఆవేదనగా పిలిచాడు ప్రసాద్.

''అంటున్నానని ఏమీ అనుకోకురా. పోనీ ఆ నలభై శాతం సక్సెస్ అయినాగానీ అమ్మ ఎంతకాలం బతుకుతుందిరా. అందుకే నా మాట విని అక్కడా ఇక్కడా అప్పుచేసి భారం పెంచుకోకు. నీ స్నేహితునిగా నీకు నేను ఇంతకంటే ఏమీ చెప్పలేనురా!''

''చాలా థాంక్స్‌రా. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దమని చెప్పిన నీ సంస్కారానికి శతకోటి వందనాలు'' చెప్పి విసురుగా బయటపడ్డాడు ప్రసాద్.

• • •

''అరే ప్రసాద్'' వినిపించిన కేకకి వెనుతిరిగాడు ప్రసాద్. దూరంగా వేగంగా తన వైపే స్కూటర్‌పై వస్తూ కనిపించాడు కృష్ణ,

''ఏమిటిరా? ఈమధ్య అస్సలు కనిపించడం మానేశావు?''

''ఏమీలేదురా!''

''అది సరేగానీ అమ్మకు ఒంట్లో ఎలా వుంది. ఈ మధ్య అమ్మను చూడలేకపోయాను. రావాలన్నా వీలు కుదరడంలేదు. ప్రసన్న, పిల్లలు బాగున్నారా?'' అడిగాడు.

''...''

''ఏమిటిరా అడిగితే సమాధానం చెప్పవు.''

''ఏమీలేదురా! అమ్మకి ఒంట్లో కొద్దిగా నలతగా వుంటే డాక్టరకి చూపించాను. క్యాన్సర్ అని చెప్పారు. ఆపరేషన్‌కి 50 వేలు ఖర్చు అవుతాయన్నారు.''

''ఏమిటీ? అమ్మకు క్యాన్సరా! మరి నాకు ఇంతవరకూ చెప్పలేదు. ఏమిటిరా మరి ఏం చేద్దామనుకుంటున్నావు?''

''అదే పాలుపోవడంలేదురా. నిన్న సుధీర్ దగ్గరికి వెళ్లాను. కనీసం అప్పుగానైనా డబ్బు ఇస్తాడేమోనని. కానీ వాడు అమ్మ వుంటే ఎంత పోతే ఎంత, ఆవిడ కోసం 50 వేలు అనవసరపు ఖర్చు అన్నట్లు మాట్లాడాడురా. ఇప్పుడు ఎక్కడైనా అప్పు దొరుకుతుం

దేమో చూస్తున్నాను'' నిర్లిప్తంగా చెప్పాడు ప్రసాద్.
మాటల్లోనే ఇల్లు రావడంతో ''రారా! కాఫీ తాగి వెళ్దువుగానీ'' పిలిచాడు ప్రసాద్.

''లేదురా అర్జంట్ పనుంది. మళ్లీ ఒక గంటలో వస్తాను'' చెప్పి వేగంగా వెళ్లిపోయాడు కృష్ణ.

నిర్లిప్తంగా నవ్వి లోపలకు వెళ్లిపోయాడు ప్రసాద్.

• • •

''ప్రసాద్ లేడామ్మా?'' ఇంట్లోకి వస్తూ అడిగాడు కృష్ణ.

''ఉన్నారండీ. పిలుస్తాను కూర్చోండి'' అని లోపలకు వెళ్లింది ప్రసన్న.

''ఏరా రాత్రి వస్తానని వెళ్లినవాడివి ఇప్పుడా రావడం?'' వస్తూ ప్రశ్నించాడు ప్రసాద్.

''లేదురా అర్జంట్ పనుండి రాలేకపోయాను. అది సరే అమ్మ ఆపరేషన్ సంగతి ఏమాలోచించావు.''

''అదే పాలుపోవడంలేదురా.''

''అరే నువ్వు ఏమీ అనుకోనంటే ఒక్క మాట. ప్రస్తుతానికి నా దగ్గర 35 వేలు వున్నాయి. వెంటనే అమ్మని హాస్పిటల్లో అడ్మిట్ చేద్దాం, మిగతా 15 వేలు రెండురోజుల్లో ఎలాగోలా నేను సర్దుతానురా'' అన్నాడు.

''కృష్ణా!''

''అవునురా. నాకు తెలుసు నీ పరిస్థితి. సుధీర్ని డబ్బడిగి వాడన్న మాటలకి గాయపడ్డ నువ్వు మళ్లీ నన్ను డబ్బు కోసం అడగలేకపోయావని నాకు తెలుసురా.''


''కృష్ణా! నిన్ను డబ్బు అడగలేకపోవడానికి కారణం అది కాదురా. నాతో పోల్చితే నీ పరిస్థితి అంతంత మాత్రమేకదా. అలాంటిది అంత డబ్బు నువ్వయినా ఎక్కడనుంచి తేగలవు.''

''అందుకని అమ్మను దూరం చేసుకుంటామా? కన్నతల్లి ప్రేమ అంటే ఏమిటో తెలియని నాకు ఆ ప్రేమని రుచి చూపించింది అమ్మేరా. ఆ అమృతమూర్తిని దూరం చేసుకోవడానికి నేను ఇష్టపడనురా. అందుకే నేను ఇంటికోసం దాచి పెట్టిన 35 వేలు పట్టుకొచ్చాను. ఇవిగో వీటితో ముందు అమ్మని హాస్పిటల్లో అడ్మిట్ చేయి. మిగతా విషయాలు తరువాత మాట్లాడదాం'' అని డబ్బు చేతికిచ్చి వెనుతిరిగాడు కృష్ణ.

• • •

''ఏమోయ్ ప్రసాద్! కృష్ణ వాళ్ల అమ్మకి ఆపరేషన్ చేసారట కదా. ఇప్పుడెలా వుంది. అడుగుదామంటే అసలు కనిపించడంలేదు కృష్ణ'' పలుకరించాడు వెంకటేశ్వరరావు.

''అదేంటి సార్! వాడు మీకు కనిపించకపోతే వాడి



స్కూటర్ మీ చేతికి ఎలా వచ్చింది?'' స్కూటర్నే చూస్తూ తిరిగి ప్రశ్నించాడు ప్రసాద్.

''అదా! నీకింకా తెలియదా. వాళ్లమ్మ ఆపరేషన్కి 15వేలు తక్కువయ్యాయని నాకీ స్కూటర్ అమ్మేసాడు'' ఇంకా ఏదో చెప్పబోయాడు వెంకటేశ్వరరావు.

అదేమీ పట్టించుకోకుండా నిశ్శబ్దంగా కృష్ణ రూమ్కి బయలుదేరాడు ప్రసాద్.

• • •

''ఏరా కృష్ణా! ఈ విషయం నాకింతవరకు ఎందుకు చెప్పలేదు ప్రశ్నించాడు ప్రసాద్.

తల వంచి ఆఫీస్ వర్క్ చేసుకుంటున్న కృష్ణ తలెత్తి ప్రసాద్ వంక చూసి ''ఏ విషయంరా!''

''అదే అమ్మ ఆపరేషన్ కోసం నీ స్కూటర్ అమ్మేసిన విషయం'' సూటిగా అడిగాడు ప్రసాద్.

చిన్నగా నవ్వి బదులిచ్చాడు కృష్ణ.

''ఆ విషయం నీకు చెబితే వద్దంటావు. ఎక్కడో అప్పు చేస్తానంటావు. తరువాత ఆ అప్పుకి వడ్డీలు తీర్చలేక సతమతమవుతుంటావు. అలా నువ్వు సతమతమవుతుంటే నేను ప్రశాంతంగా ఎలా వుంటాను? అది స్నేహధర్మం కాదురా. అంతేకాదు, నీకు ఆ రోజే చెప్పాను అమ్మని కాపాడుకోవాలి అని. అందుకు నేనే ఏమైనా చేస్తాను. అయినా నేనేమీ చేసానురా. సమయానికి నా చేతిలో వున్నదాన్ని అమ్మి అమ్మకి ఆపరేషన్ పూర్తి చేయించాను. అంతేకదా. అదిపోతే ఇంకోటి. ఇప్పుడు కాకుంటే తర్వాత. అంతేగానీ అమ్మపోతే మళ్లీ అమ్మ దొరకదురా. చిన్నప్పటినుంచీ అనాథగా బ్రతికిన నాకు తెలుసు ఆ బాధ. అందుకనే అమ్మని మా అమ్మని బతికించుకున్నాను. అంతే'' అశ్రునయనాలతో బదులిచ్చాడు కృష్ణ.

''కృష్ణా! నువ్వు నా స్నేహితుడివి కావడం నా అదృష్టంరా. అమ్మ నన్ను కన్నా నేను చేయలేని పనిని ఆమె చేతి అన్నం తిన్న నువ్వు చేసి అమ్మ విలువ తెలియజేసావురా. థాంక్స్... థాంక్స్ ఎలాట్!

★